


# ప్రాప్తము

తాళ్లూరి నాగేశ్వరరావు

"మళ్లెప్పుడొస్తావురా అబ్బాయ్ ?" అన్నాడు వెంకట్రామయ్య ఆల్మరా తలుపులు తాళంచెవితో తీస్తూ.

"పరీక్షలైనాకనే నాన్నా !" అన్నాడు రాంమ్మోహన్ సూట్‌కేస్‌లో రెండు మెడికల్ బుక్స్ దోపుతూ.

"దేవుడి దయవల్ల పరీక్ష గట్టెక్కితే—"

"మన ఆర్థిక చిక్కులు తొలగిపోతాయ్ ! ... అంతేగానాన్నా ! తప్పకుండాను. ఫస్టు క్లాసులో ప్యాసవుతాను నాన్నా ! ప్రొఫెసర్లందరూ అలాగే ఆశీర్వదించారు. నీ కోర్కె, నాపట్టుదలా, కృషీ—అంతా దానికే నాన్నా ! నువ్వు నిశ్చింతగా ఉండు" అన్నాడు రాంమ్మోహన్ సూట్‌కేసును పట్టుకొని.

ఆమాటలకు వెంకట్రామయ్యకు కొండంత ధైర్యం వచ్చింది. మనస్సులో మిక్కుటంగా మురిసిపోయాడు.

వెంకట్రామయ్య తల్లి వెంకటసుబ్బమ్మ అప్పుడే దీపం వెలిగించి నట్టింట పెట్టింది.

ఆల్మరాలో తోలుసంచీలో దాచిన పన్నెండు పదిరూపాయల నోట్లనూ ఆరు అయిదు రూపాల నోట్లను తీసి, లెక్క పెట్టి, రాంమ్మోహన్ చేతిలో ఉంచాడు వెంకట్రామయ్య బరువుగా.

ఎందుకో రాంమ్మోహన్ చేతులు వొణికాయి ఆ డబ్బు అందుకోవటానికి. తండ్రి మొహంకేసి సూటిగా చూడలేకపోయాడు. తన చదువు కోసం తండ్రి ఎంత శ్రమపడుతున్నాడు ? తన మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడు ?

"మినుములు అమ్మిన డబ్బులో ఇదే మిగిలిందిరా అబ్బాయ్! ఉన్న ఎకరం పొలానికీ ఇంకా తాశీలు కట్టనేలేదు ... ఎట్టాగో కడతాన్లే తల తాకట్టు పెట్టైనా! ముందు నీ చదువైపోతే, ఆనక సర్దుబాటు చేసుకోవచ్చు." అన్నాడు వెంకట్రామయ్య ఆల్మరా తలుపులు మూస్తూ.

రాంమ్మోహన్ ఏం మాట్లాడలేదు, మనసులో మెర మెరలాడి పోవడం మినహాయించి. సూట్‌కేస్ అందుకున్నాడు. నాయనమ్మతో 'వెళ్లొస్తాన్నాయనమ్మా ?' అని చెప్పాడు.

"బస్సుస్టాండ్‌దాకా నేనూ వస్తాన్లేరా!" అన్నాడు వెంకట్రామయ్య.

రాంమ్మోహన్ గుంటూరు మెడికల్ కాలేజీలో ఫైనల్ ఇయర్ మెడిసిన్ చదువుతున్నాడు. నాలుగురోజులు సెలవలువస్తే, ఇంటికొచ్చాడు. సెలవలు అయిపోవడంతో మళ్లీ బయలుదేరాడు.

తండ్రీ, కొడుకూ తల చావట్లోకి వచ్చే సరికే, షావుకారు రామశేషయ్య కమతగాడు యమభటుడిలా ఎదురైనాడు. వాణ్ని చూడగానే వెంకట్రామయ్య గుండె గత్తురపడి పోయింది.

'ఎంకట్రామయ్యగోరూ ! మా అయ్యగోరు అరజంటుగా రమ్మంటుండారండీ !'

"వస్తాన్లే ! నువ్వెళ్లరా!" అన్నాడు వెంకట్రామయ్యమొహంపక్కకుతిప్పి, ఈసడింపుగా.

ఆ మధ్యాహ్నం ఓ సారి కబురుచేశాడు

రామశేషయ్య. పొలాన్నుంచి వస్తూ వెళ్లొద్దామనుకున్నాడు. కానీ, తీరా పొలంనుంచి బయల్దేరేసరికే బారెడు పొద్దుకుంకలేదు. ఆదరాబాదరా ఇంటి కొచ్చాడు — అబ్బాయి వెళ్లేవేళ మించుకుపోతున్నదని. ఇంతలో మళ్లీ కబురు— కొంపలు ముంచుకుపోతూన్నట్టు! వాళ్ల అవసరం వాళ్లది! ఎలక్కి ప్రాణసంకటమైతే మటుకు పిల్లి చెలగాట మాడకుండా వుంటుందా?

మునిచీకటి ముదరడంతో వీధి దీపాలు ఒక్కసారిగా వెలిగాయి.

"నాన్నా! రామశేషయ్య ఎందుకు కబురంపుతా?" అన్నాడు రామ్మోహన్ త్రోవలో.

"ఆఁ! ప్రోనోటు వాయిదా కొచ్చిందిలే!"

"డబ్బుకు వత్తిడి పెడుతున్నాడా?"

"అవునా అబ్బాయ్!... ఎన్నాళ్లని వూరుకుంటాడు? ఆ నోటు రాసి పన్నెండేళ్లయింది. నాలుగుసార్లు తిరగ రాశాను. అయిదోసారి వాయాలి. మీ అమ్మకు జబ్బుచేసి నప్పుడు, మదనపల్లి శానిటోరియంలో చేర్చడానికి చేసిన బాకీ అప్పుడు వెయ్యిరూపాయలు. ఇప్పుడు వడ్డీలతో, అంతా కల్పి తడిసి మోపెడైంది. దాదాపుపదమూడు వేలై, గుండెమీద బండగా తయారైందిరా! ఇహ, ఆబాకీ నువ్వు తీర్చాల్సిందే! నావల్ల కాదు. నారెక్కల కష్టమంతా, నీచదువుకు తోడైంది. అప్పు తీర్చడానికి మెసులుబాటు కాలేదు. పాపంలా పెరిగి పోయిందిరా అబ్బాయ్!"

"ఇంకో మూణ్ణెల్లు ఓపికపట్టు నాన్నా! ఆబాకీని తీర్చే బాధ్యత నాది, నాకు ఉద్యోగ మొస్తే, ఈబాకీ ఓ లెక్కలోదికాదు"

గుంటూరు బస్సు వచ్చేవరకూ, బస్సు స్టాండ్‌లో తండ్రీ, కొడుకూ ఆ బాకీని గురించి మాట్లాడు కొంటూనే ఉన్నారు. తండ్రికి కొడుకూ, కొడుక్కి తండ్రీ పరస్పరం ధైర్యాలు చెప్పుకుంటూనే వున్నారు— భవిష్యత్తుమీద ఆశను లగ్నంచేసి.

కొడుకును బస్సు ఎక్కించి, నేరుగా షావుకారు రామశేషయ్య ఇంటికి వెళ్లాడు వెంకట్రామయ్య. డాబా వసారాలో పడక కుర్చీలో కూర్చుని గుమాస్తాతో మంత్రాంగం జరుపుతున్నాడు రామశేషయ్య.

నిశ్శబ్దంగా బెంచీమీద కూర్చున్నాడు వెంకట్రామయ్య.

# ప్రోనోటు

"అబ్బాయి వెళ్లాడేమిటి?" అన్నాడు రామశేషయ్య చుట్ట ముట్టిస్తూ.

"ఆఁ!... బస్సెక్కించి ఇటు వస్తున్నా. సాయంత్రమే వద్దామనుకున్నా గానీ, పొలాన పని తెమిలిందికాదు." అన్నాడు వెంకట్రామయ్య సంజాయిషీగా.


"ఈ యేటితో అయిపోతుందిగా చదువు?"

"ఆఁ!..."

"మరెక్కడైనా సంబంధాలు చూస్తున్నావా వెంకట్రామయ్యా?"

"ఉహూఁ!...ఇంకా ఏంఅనుకోవటంలా!"

"అనుకొనేదేమిటి వెంకట్రామయ్యగారూ!




అదృష్టం తలుపు తడుతూ అదేవొచ్చి పడుతుంది. కుర్రవాడు బుద్ధిమంతుడు. చక్కనివాడు. కొండ్ర తక్కువైనా చదువు గొప్పది. ఫస్టుక్లాసులో ప్యాసవుతాడు. తండ్రి కష్టాలకు తరుణోపాయం చూపగల తనయుడు. మీరు 'ఊఁ!' అనండి. మూడు నిముషాల్లో ముల్లోకాలూ మెచ్చే సంబంధం తెస్తాను" అన్నాడు గుమాస్తా చంక లెగురవేస్తూ.

"ఇప్పుడు వాడి పెళ్లికి తొందరేమొచ్చిందిలే! షావుకారుగారూ! ఈసారి కూడా మీరు మన్నించాలి. ఒక ఏడాది గడువు విస్సించండి. మీ ప్రోనోటు బాకీ అణాపైసలతో సహా తప్పకుండా తీరుస్తాను. మా అబ్బాయి ఎక్కివస్తే, మీ అప్పు తీర్చడం కష్టంకాదు." అన్నాడు వెంకట్రామయ్య ప్రాధేయపూర్వకంగా.

రామశేషయ్య మాట్లాడలేదు. ఇరుకైన భ్రుకుటి ముడిచి కొన్ని క్షణాలపాటు ఆలోచించాడు. షావుకారుగారు ఏమంటాడోనని వెంకట్రామయ్య బెంబేలు పడిపోయాడు.

"మళ్లీ ప్రోనోటు తిరగ రాయించమంటారా? ఓ సంవత్సరం గడువు అడుగుతున్నాడుగా వెంకట్రామయ్య!" అన్నాడు గుమాస్తా గడుసు బుర్రతో.

షావుకారుగారి మొహంకేసి ఆత్రుతగా చూశాడు వెంకట్రామయ్య.

"రాయించు" అన్నాడు రామశేషయ్య గుమాస్తాతో.

గుండెమీద కుంపటి తొలగినట్టుగా నిట్టూర్పు విడిచాడు వెంకట్రామయ్య.

వెంటనే డస్కులోంచి ప్రోనోటుతీసి, అంతకుముందే కట్టిన వడ్డీ లెక్కను మరోసారి చూసి, మొత్తం పదమూడు వేల మూడొందల అరవైకి ప్రోనోటు వ్రాసి, వెంకట్రామయ్యచేత సంతకం పెట్టించాడు గుమాస్తా. నమస్కారంచేసి లేవబోయాడు వెంకట్రామయ్య 'కూర్చో? తొందరేముంది?' అన్నట్టు చేత్తో సైగ చేశాడు రామశేషయ్య.

"వెంకట్రామయ్యా! నువ్వు ఏమీ అనుకోనంటే ఓ సలహా చెబుతాను." అన్నాడు రామశేషయ్య తాపీగా.

"చెప్పండి"

"నీఅప్పు కోటప్పకొండంతైంది. నీకున్న భూస్థితి తిండిగింజలకు సరిపోయేదే! ఉన్న పొలం పోకడ పెడితే అన్నానికి అడుక్కోవల్సిందే! ఇక మీ అబ్బాయి ప్యాసై, ఉద్యోగం చేసి, తీర్చాలన్నా ఇప్పుడిప్పుడే సాధ్యపడేదికాదు. ఈరోజుల్లో ఏముంది? ఎంత చెట్టుకంతగాలి అన్నట్టు— ఎన్నిరాళ్లు తెచ్చుకొన్నా, ఖర్చులు అంతకు రెండింతలుగా ఉన్నాయి. ఉద్యోగాలుచేసి, ఊళ్లేలి ప్రోనోటు బాకీ తీర్చడమనేది ఇసుకతో త్రాడు పేనినట్టే! ఏమంటావ్? కాబట్టి—"

"చెప్పండి"

"మీ అబ్బాయికి వెంటనే పెళ్లి చేసేయ్! పాతికో, ముప్పైవేలో కట్నం వస్తుంది. ఇటు నా ప్రోనోటు బాకీ తీరుతుంది, అటు పదీ పరకా మిగిల్తే డబ్బు అక్కరకొస్తుంది.

ఏమంటావ్ ? " అన్నాడు రామశేషయ్య చుట్ట అవతల పారవేస్తూ.

"అయ్యగారి సలహా అద్భుతంగా వుంది" అన్నాడు గుమాస్తా వంత పలుకుతూ.

వెంకట్రామయ్యకు గుప్పు కుత్తుక పడిపోయింది.

"నా సలహాలో తప్పేమైనా వుందా ?... ఆలోచిస్తున్నావేమిటి వెంకట్రామయ్యా !" అన్నాడు రామశేషయ్య ఉత్కంఠంగా.

"ఏం లేదు ! అబ్బాయిని అడగాలిగా !"

"అంత పిరికిగా మాట్లాడతారేం వెంకట్రామయ్యగారూ! మీరడిగితే మీ అబ్బాయి కాదంటాడా ? పరిస్థితుల ననుసరించి ప్రవర్తించడమే బ్రతకనేర్చినవాళ్ల పద్ధతి. మీ అబ్బాయి చదువుకోసం అప్పుచేశావుగానీ, మరో తప్పు చేశావా ? నిర్భయంగా అడగొచ్చు; ఒప్పించవచ్చు ! సంబంధం కూడా వేరే వెతకనక్కర్లేదు. మీ కాళ్ల దగ్గిరే కాచుక్కూచుంది మీరు 'ఊఁ!' అనడమే తరువాయి మూడోనాటికి ముడివేయవచ్చు' అన్నాడు గుమస్తా గుక్క తిప్పుకోకుండా.

" ఎక్కడా ? "

"మరెక్కడోకాదు. ఇక్కడే! షావుకారుగారి మూడో అమ్మాయి పుత్తడి బొమ్మ. సంసారపక్షంగా చదువుకుంది. కట్నం అడగక్కర్లేదు నీ ప్రోనోటు బాకీ పోగా, పాతికేముప్పై వేలు రొక్కంకూడా వస్తుంది. బస్తీలో సొంతంగా హాస్పటల్ పెట్టుకున్నా డబ్బు సాయం చేస్తారు. ఊళ్లో అండ వుంటుంది. ఈ సంబంధం చేసుకుంటే మీ కుటుంబం పరువు ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఆయన పిల్చి పిల్లనిస్తానంటే, నోట్లో నువ్వుగింజ నానుతావేం ? ఊఁ! అను వెంకట్రామయ్యా!" అన్నాడు గుమాస్తా గడికాళ్లు వేస్తూ.

వెంకట్రామయ్య నిలువుకళ్ళతో కూర్చుండిపోయాడు. కర్తవ్యం తోచలేదు ఒళ్లంతా చిరు చెమట పోసింది. మనస్సులో ఆలోచనలు పోవడంలేదు. నోటిమీద కాయ పడకుండా గుమాస్తా వాగుతున్నాడు; అరిచేతిలో వైకుంఠం చూపెడుతున్నాడు; భవిష్యత్తు బంగారు పంట అంటున్నాడు. షావుకారుగారితో వియ్యమందడం తనలాంటి బక్క రైతుకు వాస్తవంగా మహాభాగ్యమే ! పెద్ద కూతుర్ని కారంచేడులో ఒక షావుకారు కొడుక్కి లక్షరూపాయల కట్నంతో ఇచ్చాడు.

# ప్రోనోటు

రెండో కూతుర్ని మోరంపూడి మున్సబు పెద్దకొడుక్కి ఇచ్చాడు భారీ కట్నం కానుకలతో, నిజంగా వాళ్లసరసన నిలబడే స్తోమత, తాహతూ తనకు లేదు. ఒకరకంగా ఇది అబ్బాయి అదృష్టమే! పూర్వజన్మలో చేసుకొన్న పుణ్యమే! అయితే అబ్బాయి ఏమంటాడో!... ఏమంటాడు ? తనని కాదంటాడా ? ఇంతకాలం తాను పడిన కాయకష్టమంతా వాడి క్షేమం కోసమేగదా! తనమాట కాదంటాడా ? వాడల్లాంటి వాడు కాదు ...

షావుకారు రామశేషయ్య నిమ్మకు నీరెత్తినట్టుగా కూర్చున్నాడు - గుమాస్తాకు వకాల్తా ఇచ్చి

మనస్సులో నిర్ణయం చేసుకొన్న తర్వాత, షావుకారు కేసి ముసి ముసి నవ్వులతో చూశాడు వెంకట్రామయ్య. ఆవలిస్తే పేగులు లెక్కించడంలో అందెవేసిన చేయి గుమాస్తా. వెంకట్రామయ్య నిర్ణయాన్ని పాములాగా వాసన పట్టాడు.

"మీ సమ్మతిని కూడా మీనోటిద్వారా వెల్లడించండిసార్ !" అన్నాడు గుమాస్తా షావుకారుతో.

"ప్రత్యేకంగా చెప్పేదేముంది ? వెంకట్రామయ్య ఒప్పుకొంటే, నేను కాదంటానా?" అన్నాడు రామశేషయ్య గంభీరంగా.

"మీతో వియ్యమందడం కంటె నాకు కావల్సిందేముంది రామశేషయ్యగారూ! నిజంగా ఇది మా అబ్బాయి అదృష్టమే!" అన్నాడు వెంకట్రామయ్య.

"శుభస్య శీఘ్రం" అన్నాడు గుమాస్తా.




తర్వాత పదిహేను రోజులకు వెంకట్రామయ్యగారి అబ్బాయి రాంమ్మోహన్‌కూ, షావుకారు రామశేషయ్యగారి మూడో అమ్మాయి రాజేశ్వరికి అవూళ్లోనే వైభవంగా పెళ్లి జరిగింది. ఆ పెళ్లికి రాంమ్మోహన్ ఒక పట్టాన ఒప్పుకోలేదు. చదువు పూర్తి అయి, ఉద్యోగంలో చేరితేగానీ పెళ్లిచేసుకోనని మకురుపట్టు పట్టాడు. అయితే, తండ్రి అదురూ, బెదురూపెట్టి, కొడుకును అంకెకు తీసుకొచ్చాడు. తండ్రిమీద గల భయమూ, భక్తితో రాంమ్మోహన్ పెళ్లికి ఒప్పుకున్నాడు.

కాని, పెళ్లిజరిగినా 'ఫలానా కట్నం' అని షావుకారు రామశేషయ్య నగదు రూపంలో వెంకట్రామయ్యకు ఏమీ ముట్టజెప్పలేదు. 'ముప్పైవేలు ఇస్తే మటుకు నువ్వెక్కడ దాస్తావు వెంకట్రామయ్యా! ఈరోజుల్లో అంత డబ్బును కాపాడ్డానిక్కూడా అనుభవమూ, తెలివితేటలూ కావాలి. అబ్బాయి చదువు పూర్తి అయ్యాక, హాస్పటల్ పెడితే అక్కర కొస్తుంది అందాకా దానిమీద వడ్డీలు నేనే పెంచుతాను." అన్నాడు రామశేషయ్య ఓసారి.

వెంకట్రామయ్యకు నోట్లో నీళ్ల లేక ఎదురు మాట్లాడలేదు: ఇంకా ప్రోనోటు సంగతి ప్రత్యేకంగా ఏం ఎత్తుతాడు ?

పోతే, ఆ పెళ్లితో బరువూ బాధ్యతా తొలగి, ఒళ్లంతా తేలిక పడింది వెంకట్రామయ్యకు. అయితే—


ఈ వ్యవహారంలో ఎవరు తెలివిగా వ్యవహరించారు ? ఎవరిని అదృష్టం వరించింది ? మొదలైన ప్రశ్నలకు ఊళ్లోవాళ్లు తలా ఓ రకంగా సమాధానాలు చెప్పుకో సాగారు. లక్షలకు లక్షలు ఆస్తిగల షావుకారూ, అంతస్తుల ముందు అంతఃకరణలను ఖాతరు చేయని ఆ పెద్ద మనిషి, సామాజిక హోదా కోసం పడిచచ్చే రామశేషయ్య — ఏ కిటుకూ లేకుండా తన పిల్లను పేదరైతు కొడుక్కి ఇచ్చాడా ? ఇందులో ఏదో ఆంతర్యముంది ? అనుకున్నారు కొంతమంది. ఆ ఆంతర్యం తెల్సినవాళ్లు పెళ్లి అయ్యేదాకా గుట్టు చప్పుడు కానివ్వలేదు. తర్వాత అగుబ్బుగా చెప్పుకోసాగారు. అదేమంటే.

షావుకారుగారి మూడో అమ్మాయి రాజేశ్వరికి గత మూడేళ్లుగా మూర్ఛల జబ్బు ఉందనీ; దాన్ని నయం చేయించడానికి గాను ఆ పిల్లను హైదరాబాద్‌లో మేనమామ ఇంట్లో పెట్టారనీ. ఎంతమంది డాక్టర్లకు చూపెట్టినా, ఎన్ని మందులిచ్చినా, ఎంత

డబ్బు ఖర్చుపెట్టినా అది నయం కాలేదనీ; పెళ్లి చేస్తేగానీ ఆ జబ్బు తిరుగుముఖం పట్టదని కొంతమంది సలహాలిచ్చారనీ;ఆమేరకు పెళ్లి చేయడం జరిగిందనీ, ఈ విష యాలు వెంకట్రామయ్యకు తెలియ డానికి రెండు నెలలూ, రాంమోహన్‌కు తెలియడానికి మూడునెలలూ పట్టింది.

"రామశేషయ్య ఎంతమోసంచేశాడురా?" అన్నాడు వెంకట్రామయ్య కసిగా.

"ఆయన చేసిన మోసమేముంది నాన్నా ! నుదుట వ్రాయనిదే నోరు పలకదు. నువ్వు మాట ఇచ్చావు. నేను శిరసావహించాను. ఇప్పుడు అఘోరించి లాభమేముంది ? పెద్ద డాక్టర్లతో మాట్లాడి, ఆజబ్బును నేను నయం చేయిస్తాను. నువ్వు దిగులుపడకు" అన్నాడు రాంమోహన్.





ఆమెకు ఫోర్‌హెన్స్ వాడే అలవాటు కూడ నేర్పండి

నియమానుసారం పళ్లను ఇగుళ్లను రోజూ తోముకుంటే ఇగుళ్లబాధలను, దంతక్షయాన్ని అరికట్టుతుంది.

దంతవైద్యులు అంటున్నారు, ఇగుళ్లను గట్టిగాను ఆరోగ్యవంతంగాను వుంచుకొనుటకు ఉత్తమవిధానం వాటిని సక్రమంగా రోజూ తోముకొనుచుండుటయే మరియు దంతక్షయమును నిలుపుటకు దంతక్షయకారక ఆహార అణువులన్నిటినీ నిర్మూలించే నిమిత్తం ప్రతి రాత్రి, ఉదయమున, ప్రతి భోజనానంతరం పళ్లను సక్రమంగా తోముకొనుచుండవలెను.

మీ బిడ్డకు ఫోర్‌హెన్స్ వాడే అలవాటును, సక్రమంగా రోజూ ఫోర్‌హెన్స్‌తో పళ్లను తోముకొనుట నేర్పండి, ఫోర్‌హెన్స్ ఒక దంతవైద్యునిచే సూత్రీకరించబడిన టూత్ పేస్టు మరియు ఫోర్‌హెన్స్ డబల్ ఏక్షన్ జూనియర్ టూత్ బ్రష్‌తో ఇగుళ్లను మెల్లగా తోముకోమని నేర్పండి.

ఫోర్‌హెన్స్‌తో దంతసంరక్షణ ఎంత లేత ప్రాయంలో నేర్పితే అంత ఉత్తమం




ఉచితం! "మీ దంతములు, ఇగుళ్లు గురించి తీసుకోవలసిన శ్రద్ధ" అనే వివరణాత్మకమైన రంగుల చిన్న పుస్తకము కొరకు మీ ప్రతికోసం 25 పైసల తపాలా బిళ్లలను (తపాలా ఖర్చులకై) మేనర్స్ డెంటల్ అడ్వయిజరీ బ్యూరో, పోస్టు బ్యాగ్ నం. 10031, బొంబాయి 1, ఈ కూపన్‌తో పాటు పంపండి.

పేరు ______________ వయస్సు ______

చిరునామా ______________

ఇంగ్లీషు, హిందీ, మరాఠీ, గుజరాతీ, ఉరుదు, పంజాబీ, బెంగాలీ, అస్సామీస్, తమిళం, తెలుగు, మలయాళం మరియు కన్నడం వీటిలో మీకు కావలసిన భాష క్రింద గీత గీయండి. AP-1

ఫోర్‌హెన్స్
దంతవైద్యునిచే సృష్టింపబడిన టూత్‌పేస్టు

133F-203 TL

మామగారింట్లో రాంమ్మోహన్ రెండు సార్లు ప్రత్యక్షంగానే చూశాడు రాజేశ్వరికి పెద్ద ఎత్తున ఫిట్స్ రావడం. గుంటూరులో పెద్ద డాక్టర్లతో మాట్లాడి భార్య జబ్బు నయం చేయించడానికి వెంటనే ప్రయత్నాలు చేస్తానని రాంమ్మోహన మామగారితో అన్నాడు. ఎంతడబ్బు అయినా ఖర్చుపెడతానని రామశేషయ్య అన్నాడు.

కాని—;

ఉగాది పండుగ వెళ్లిన మరునాడు రాంమ్మోహన్ అటు గుంటూరు వెళ్లగానే, మేడమెట్ల పైన ఫిట్స్ వచ్చి పడిపోయి, కొద్ది నిముషాల్లోనే రాజేశ్వరి మరణించింది అంతా ఘొల్లుమన్నారు.

ఆపైన రెండేళ్ళకు రాంమ్మోహన్ మెరిట్ స్కాలర్‌షిప్‌మీద మెడిసిన్‌లో ఉన్నత విద్యకు అమెరికా వెళ్లాడు.

వెంకట్రామయ్య ఉన్న ఎకరంతోనే మామూలుగా వ్యవసాయం చేసుకొంటున్నాడు నిశ్చింతగా. ఒకరోజు సాయంకాలం షావుకారు రామశేషయ్య కబురు పెట్టగా, ఆయనింటికి వెళ్లాడు వెంకట్రామయ్య ఎందుకోనని.

డాబావసారాలో పడకకుర్చీలో రామశేషయ్య పడుకొని, చుట్ట కాల్చుకుంటూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. పక్కన గుమాస్తా కూడికలు, తీసివేతలతో కుస్తీ పడుతున్నాడు. వెంకట్రామయ్య నిశ్శబ్దంగా బెంచీమీద కూర్చున్నాడు.

"ఎందుకూ కబురంపావు ?" అన్నాడు వెంకట్రామయ్య పొడిగా దగ్గి.

"ఆ!... ఏంలేదు? ఆ ప్రోనోటు బాకీ అల్లాగే వుంది. వాయిదా దగ్గరకు వచ్చింది. పైకం ఇస్తావా, మళ్లీ ప్రోనోటురాస్తావా?" అన్నాడు షావుకారు రామశేషయ్య ఎదురుగ్గా గేటుపక్కనవున్న మందారచెట్టు పువ్వులమీద పడే ఎర్రని సాయంకాలపు ఎండనుచూస్తూ.

వెంకట్రామయ్య గుండె చెదిరిపోయింది. 'ఏ ప్రోనోటు ?' అనబోయాడు. కాని ఆ మాట గొంతులోంచి పెకలి బయటకురాలేదు.

దాదాపుమూడేళ్ల క్రితం వెంకట్రామయ్య పదమూడువేల మూడొందల అరవైరూపాయలకు వ్రాసిన ప్రోనోటును షావుకారు రామశేషయ్యకు అందించాడు గుమాస్తా.

నోరెండిపోయి, ఆ నోటు కేసి చూస్తూ ఉండిపోయాడు వెంకట్రామయ్య నిలువు కన్నులతో.

# ప్రశ్నావళి

— కె. రామలక్ష్మి

**వి. ఏ ఆర్. పొదుటూరు.**

యువతీయువకుల మధ్య కలిగే ప్రేమకు కారకులు ఎవరంటారు ?

వయస్సు!

**డి. ఆర్. ఆర్. విజయవాడ.**

అనుభవం విలువ ఎంత?

అనుభవం దారి చూపాలే గాని— దారికి అడ్డు నిలవకూడదు. అప్పుడే దానికి విలువ.

**లత. ప్రకాశరెడ్డి పేట.**

మీ అభిమానులలో నేనొకత్తెని. మీరు అహంభావులని నా స్నేహితురాలు . .

స్వయంశక్తిమీద పైకొచ్చిన ఎవరికేనా కాస్తంత అహంభావం ఉంటుంది— లతా. . . . నా రాతలు నేనే రాసుకుంటాను! . .

**వి. ఎస్ ఎస్. ఎడపల్లి.**

జీవితంలో సుఖసంతోషాలు ఎప్పుడు కల్గుతాయి?

ఆశ తక్కువ ఉన్నప్పుడు. . . . కాని ఆశలెప్పుడు అంతు ఉండదుకదా, అంచేత సంపూర్ణ సుఖసంతోషాలు ఎప్పుడు కలగవు!

**ఎన్. ఆర్. ఎమ్. ద్రోణాచలం.**

ప్రపంచంలో స్త్రీకి ఉన్నతస్థానం ఉందని చాలామంది స్త్రీలు తను భర్తలను బానిసలుగా చూడడం నూటికి తొంభయితొమ్మిది పాళ్ళు— నేను చూశాను.

ఎప్పుడొచ్చారు ప్రపంచ పర్యటన నుంచి?!

**జి. జి. ఆర్. ఇజ్జవరం.**

మీ వ్యాసాలు, కథలు చదివితే ఏ మూలనైనా రవ్వంత వరకట్నంపై వ్రాసి ఉంటుంది. మీ స్వవిషయంలో అలా జరిపించారా ?

పిచ్చి వాన్నా— స్వవిషయంలో ఏమాత్రం అలా జరిగినా దొంగకి తేలు కుట్టినట్టు— కిక్కురు మనకుండా వూరుకోనా?!

**కె. ఆర్. దేవుదళ (శ్రీకాకుళం జిల్లా)**

ఏమండీ, ప్రేమ గుడ్డిది అంటారు. ఎంతవరకు నిజం?

నూటికి నూరు పాళ్ళు— న్యాయంలాగే ప్రేమ కూడా పుట్టు గుడ్డి.

**సి. హెచ్. బి. కడప.**

రెండక్షరభ్యాసాలు నేర్చినంత మాత్రాన తమ్ము తామే మరచిపోతారు ఆడవాళ్లు ఎందుకో ?

ఇదెక్కడి అక్షరాభ్యాసం తమ్ముడూ—ఆడదానికి రెండు పుట్టుకలున్నాయి. ఒక జన్మెత్తినప్పుడు రెండోది జన్మనిచ్చినప్పుడు అక్షరాభ్యాసం మీకూ— మాకూ ఒకటే.

**ఆర్. ఆర్. ఆర్. బెంగుళూరు.**

దాంపత్య జీవితంపై మీ అభిప్రాయం ?

ఇచ్చి పుచ్చుకొనేది—దాంపత్య జీవితం. 'మనిద్దరం కలిసి' అన్న భావన లేని సంసారాలు— దాంపత్యాలు కావు—కేప్టివ్ లేవ్.

**పి. ఆర్. బి. రాజమండ్రి.**

మీ హాబీలు ఏమిటి ?

కుట్లూ అల్లికలూ కావు. వంటా వార్పూ అంతకంటేకాదు. హన్కా! బాతా కానీ!

**కె. జె. ఆర్ హైదరాబాదు.**

డ్యూటీకీ బ్యూటీకీ చుక్కెదురు. అవునా!

అవును సార్, డ్యూటీలైను తిన్నన! బ్యూటీలైను వంపున!! డ్యూటీలైను ఫాలోకండి. బ్యూటీ వెంటపడి అదే వస్తుంది.

**కె. జె. ఎస్. ఎమ్. హైదరాబాదు.**

వంద పువ్వులు వికసించనివ్వండి. వందఆలోచనలు ఆలోచించనివ్వండి. ఏమంటారు కెరాగారు ..

వద్దండానికి నేనెవరండి.

**ఐ. ఆర్. ఆర్. విశాఖపట్నం.**

...ప్రేమించి పెళ్లి చేసుకోవాలంటే చాలా కష్టాల నెదుర్కోవాలి. ముఖ్యంగా ఇందువలన చదువుకి ఆటంకం కల్గుతుందని భయపడుతున్నాను...

ఇంకా ఏదో ముద్దు గడవదని భయపడుతున్నా సంటావేమో ననుకున్నాను: తమ్ముడూ—ప్రేమించడానికొక్క 'కోతి' లాంటి మనసుంటే చాలదు—

